www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 13 ఏప్రిల్ 2025
5
కాకినాడ

ఇంటర్‌లో విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో ఇంటర్ ఫలితాలలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించినట్లు ఇంటర్ డివైఇఒ ఏసుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్ కేటగిరీలో 12,920 మంది విద్యార్థులు 63 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఒకేషనల్ కోర్స్‌లో 828 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం సంబంధించి జనరల్ కేటగిరిలో 17,326 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 78 శాతం మంది విద్యార్థులు 13582 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ కోర్స్ సంబంధించి 1376 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 68 శాతం విద్యార్థులు అనగా 941 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని డివైఇఒ తెలిపారు.

కొనుగోలు సిబ్బందికి కడగండ్లు

- మూడు నెలల కాలానికి అందని జీతాలు
- అప్పులతో ఉద్యోగుల ఆక్రందన

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రైతుల సంక్షేమం కోసమే తామ ప్రభుత్వం పని చేస్తుందన్నట్లుగా పాలకులు గొప్పలు చెబుతున్నప్పటికీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాత్కాలిక పద్ధతిలో నియమించిన సిబ్బందికి మాత్రం వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గత ఖరీఫ్ సమయంలో ధాన్యం సేకరణలో కీలకంగా వ్యవహరించిన సిబ్బందికి రబీ సీజన్ వచ్చినప్పటికీ మూడు నెలల జీతాలు ఇవ్వలేదు. ఇచ్చేది అరకొర వేతనమే అయినా వాటితోనే కుటుంబాలను పోషించుకునే వీరి పరిస్థితి ప్రస్తుతం అగమ్య గోచరంగా మారింది. ఇప్పుడు రబీ సీజన్‌లో ధాన్యం సేకరణ కోసం ఆకలితో అలమటిస్తూ ఎలా పని చేయాలంటూ సిబ్బంది ఈ సందర్భంగా అధికారుల తీరుని ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో ప్రధానంగా వరి పండించే రైతులు ఎక్కువగా ఉన్నారు. ధాన్యం దళారుల పాలు కాకుండా గిట్టుబాటు ధర కల్పించడం కోసం ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో మెజారిటీ ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. దళారీ వ్యవస్థను అరికట్టేందుకు కొనుగోలు కేంద్రాలు ఎంతో ఉపయోగ పడున్నాయన్నట్లుగా ప్రభుత్వం చెప్పుకొస్తోంది. ఈ నేపథ్యంలో రైతుల సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ముగ్గురు సిబ్బందిని నియమిస్తున్నారు. ఒక టెక్నికల్ అసిస్టెంట్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక సహాయకుడు పని చేస్తున్నారు. టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.15 వేలు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.12 వేలు, హెల్పర్‌కు రూ.9 వేలు జీతంగా ఇస్తున్నారు. ఈ మూడు కేటగిరీల్లో జిల్లాలో 280 మంది చొప్పున మొత్తం 840 మందిని నియమించారు. వీరికి గత ఖరీఫ్ సీజన్లో పని చేసినందుకు అక్టోబర్, నవంబర్, డిసంబర్ నెలలకు సంబంధించిన వేతనాలు నేటికీ అందలేదు. మొత్తం రూ.30.01 లక్షల జీతాలు పేరుకుపోయాయి.

అష్టకష్టాలు పడుతున్న సిబ్బంది

గత ఖరీఫ్ సీజన్లో మూడు నెలల పాటు కొనుగోలు కేంద్రాలలో పని చేసిన సిబ్బందికి ప్రభుత్వం వేతనాలు నేటికీ విడుదల చేయకపోవడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే పరిస్థితికి దిగజారారు. మూడు నెలలు గడిచిపోయినప్పటికీ ఒక రూపాయి కూడా వేతనం విడుదల కాలేదని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తమను ఆదుకోవాలని సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ శాతాన్ని పరీక్షిస్తున్న టెక్నికల్ సిబ్బంది

కేంద్రాల్లో కనిపించని సిబ్బంది

ప్రస్తుతం రబీ సీజన్ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా యంత్రాల సాయంతో ముమ్మరంగా కోతలు జరుగుతున్నాయి. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా అన్నదాతలు ధాన్యాన్ని అమ్ముకునేందుకు తొందరపడుతున్నారు. ఈ నెల 3 నుంచి 225 ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లాలో ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రాలకు వెళుతుంటే ప్రభుత్వ నిర్వాకంతో అక్కడ సిబ్బంది కనిపించని పరిస్థితుల్లో దళారులకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వం 75 కిలోల ఎ గ్రేడ్ రకానికి రూ.1740 మద్దతు ధర కల్పిస్తోంది. అయితే ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలు అక్కరకు రాకపోవడంతో రూ.1200 నుంచి 1400కే అమ్ముకుంటున్న పరిస్థితి ఏర్పడింది. వారం రోజులు గడచినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కొనుగోళ్ళు నామమాత్రంగానే ఉన్నాయి. గురువారం కేవలం 6 కేంద్రాల ద్వారా 23 మంది రైతుల నుంచి 261 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయగలిగారు. సిబ్బందికి వేతనాలు విడుదల చేయకపోవడంతో కొనుగోలు కేంద్రానికి వెళ్లేందుకు అయిష్టత చూపుతున్నట్టు తెలుస్తోంది. అందుచేత రైతులు కేంద్రాలకు వెళుతున్నా సిబ్బంది ఎవరు కనిపించని నేపథ్యంలోనే ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవాల్సి వస్తుంది. కావున ప్రభుత్వం వెంటనే వారికి వేతనాలు చెల్లించి కొనుగోలు కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులకు కోరుతున్నారు.

ప్రదక్షిణలు చేస్తున్నాము

పొలాల్లోకి వెళ్లి శాంపిల్స్ సేకరించి తేమ శాతాన్ని పరీక్షించి రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయిస్తున్నాం. ప్రతి నెలా జీతాలు ఇస్తామని అధికారులు చెప్పి నియమించారు. ఇప్పుడు మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని మా వేతనాలు ఇప్పించాలి.

- జి.స్వామి, టెక్నికల్ అసిస్టెంట్.

వేతనాలు వెంటనే విడుదల చేయాలి

మూడు నెలల కాలానికి ప్రభుత్వం వేతనాలు ఇవ్వాలి. ఈ ఏడాది జనవరి నుంచి మూడు నెలలు గడిచిపోయినప్పటికీ ప్రభుత్వం నేటికీ విడుదల చేయలేదు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నాం. అధికారులు వెంటనే చొరవ తీసుకోవాలి.

-ఎన్.రమేష్, టెక్నికల్ అసిస్టెంట్, చేబ్రోలు.

త్వరలోనే వేతనాలు చెల్లింపునకు చర్యలు

కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది వేతనాలు పెండింగ్‌లో ఉండడం వాస్తవమే. ఈ విషయాన్ని జెసి దృష్టికి తీసుకు వెళ్ళాం. కొన్ని సాంకేతిక సమస్యల వల్ల ఆలస్యం అయ్యింది. అతి త్వరలోనే వారి వేతనాలు విడుదల అవుతాయి.

- దేవుల నాయక్, సివిల్ సప్లై డిఎం.

ఉద్యోగుల ప్రయోజనాలే ముఖ్యం

ప్రజాశక్తి-కాకినాడ

ఉద్యోగుల ప్రయోజనాలే ముఖ్యంగా పని చేస్తూ ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరిస్తామని ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కాకినాడలోని రెవెన్యూ అసోసియేషన్ భవన్‌లో బొప్పరాజు మాట్లాడారు. రెవెన్యూ వ్యవస్థలో వస్తున్న మార్పులు, నూతన సాంకేతికతను తెలియజేసేందుకు రెవెన్యూ ఉద్యోగులకు కోసం ఒక రెవెన్యూ అకాడమీ ఏర్పాటు చేసి వారికి తగు శిక్షణను ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. తక్షణమే పిఆర్‌సి కమిషనర్‌ను నియమించాలని, దీనికి ఎటువంటి ఖర్చు ప్రభుత్వానికి అదనంగా అవ్వదని ఆయన తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను వేగంగా పనిచేయాలని, ప్రభుత్వం పారదర్శంగా పని చేయాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అన్ని శాఖలలో ప్రభుత్వానికి రెవెన్యూ చాలా కీలకమైందని ఇందులో నైపుణ్యం ఉన్న ఉద్యోగులు కింది స్థాయి వారు లేకపోవడంతో పనులు ఆలస్యమై ప్రజల్లో తమ శాఖపై చులకన భావం ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో 15 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉంటే వారిలో 2 వేల మందిని మాత్రమే రెగ్యులర్ చేశారని మిగిలిన వారు చాలా ఆందోళనలో ఉన్నారన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తారేమోనన్న భయంలో ఉన్నారని అందువల్ల వారికి భరోసా కల్పించాలన్నారు. ఆప్కాస్ ద్వారా నియామకం పొందిన వారికి ఏజెన్సీ మార్పు చేస్తారేమోనని ఆందోళనగా ఉన్నారన్నారు. వారికి కూడా ఉద్యోగులకు భరోసా కల్పించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఐఆర్ ఇవ్వాలని, మూడు డిఎలు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత అక్టోబర్ నెల నుంచి ప్రభుత్వం గ్రాడ్యుటీ ఇవ్వలేదన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ సర్వీసెస్ రాష్ట్ర అధ్యక్షుడు పితాని త్రినాథరావు, ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర అసోసియేట్ చైర్మన్ టివి.ఫణి పేర్రాజు, ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాసరావు, ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిఎస్‌ఎస్‌ఎన్వీ శాస్త్రి, రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్, ఎపి జెఎసి అమరావతి కాకినాడ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎన్విఎస్‌ఎస్‌ఆర్కే దుర్గాప్రసాద్, రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ కాకినాడ జిల్లా శాఖ కార్యదర్శి ఎస్ రామ్మోహన్, ఉమెన్స్ వింగ్ చైర్మన్ సిహెచ్ సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శి పి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

గ్రామాల్లో 'ఊరి బడిని కాపాడుకుందాం'

ప్రజాశక్తి -కరప

యుటిఎఫ్ పిలుపు మేరకు ప్రతి గ్రామంలో 'ఊరి బడిని కాపాడుకుందాం" అనే కార్యక్రమంలో భాగంగా ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా నాయకులు ఐ.ప్రసాదరావు తెలిపారు. శనివారం గురజనాన పల్లిలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల యొక్క విశిష్టతను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ 20 ఏళ్లుగా యుటిఎఫ్ స్వచ్ఛందంగానే బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనేక వేల రూపాయలు ఖర్చు చేసి కరపత్రాలు ముద్రించి గ్రామాల్లో చైతన్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. హెచ్ఎం సాయి మోహన్, వివి రమణమూర్తి పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

శిక్షణను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

మహిళల అభివృద్ధికి చేయూత

ప్రజాశక్తి - సామర్లకోట

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల శిక్షణ కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట సంగీతరావు పేటలో శనివారం బిసి కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంఎల్ఎ చినరాజప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై వారు నిలదొక్కుకుని ఆర్థికంగా కుటుంబాలను అభివృద్ధి పరుచుకునేందుకు కుట్టు శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పెద్దాపురం నియోజకవర్గంలో ఇప్పటివరకు ఏడు కుట్టు శిక్షణలు ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. ఈ కుట్టు శిక్షణాలను ఉపయోగించుకొని కుటుంబపోసనలో భర్తలకు సహకారంగా ఉండడంతో పాటు అన్ని రంగాల్లో కూడా అభివద్ధిని సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమం బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, బలుసు వాసు వల్లూరి దొరబాబు, అందుగుల జార్జి చక్రవర్తి, జనసేన నాయకులు పెట్టా జానకి రామారావు, పెంకే వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రభుత్వ పాఠశాలల సత్తా

ఇంటర్ ఫలితాల్లో పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

ఏలేశ్వరం ఇంటర్ ప్రథమ ద్వితీయ పరీక్ష ఫలితాల్లో ఏలేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. రెండో సంవత్సరం ఫలితాల్లో 85 శాతం, ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 60 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. బైపిసిలో రెండో సంవత్సరం 1000/972 మార్కులు సాధించి పెండ్యాల రాజ్ కుమార్ ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. ద్వితీయ స్థానంలో యు.సుసానే రాణి 1000/928, తృతీయ స్థానంలో పెండ్యాల మేరీ సునంద 1000/920 మార్కులు సాధించినట్టు తెలిపారు.

గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల సెకండియర్ ఎంపిసి విద్యార్థిని జ్యోతుల సాయి జ్యోతి 1000/983 మార్కులు సాధించి కాకినాడ జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచింది. వడ్లమూరి జయలక్ష్మి సెకండ్ ఇయర్ సిఇసిలో 939 మార్కులు సాధించి నియోజకవర్గ టాపర్‌గా నిలిచింది.

ఏలేశ్వరంలోని బాలయోగి గురుకుల కళాశాల విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ శారదా దేవి తెలిపారు. పరీక్షలకు 56 మంది విద్యార్థులు హాజరు కాగా 56 మంది ఉత్తీర్ణత సాధించారని ఆమె తెలిపారు. వీరిలో 48 మంది ఎ గ్రేడ్, 8 మంది విద్యార్థినిలు బి గ్రేడ్ సాధించారని ఆమె తెలిపారు.

కాజులూరు జిల్లాలో తమ కళాశాల విద్యార్థిని కాదా దేవి హాసిని ద్వితీయ స్థానం సాధించిందని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ ఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం 93 మంది విద్యార్థులు హాజరుకాగా 66 మంది విద్యార్థులు పాసై 71 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. కాదా దేవి హాసిని ఎంపిపి గ్రూపులో 1000/ 976 మార్కులు సాధించినట్టు తెలిపారు. విద్యార్థిని, తండ్రి కాదా కోటేశ్వరరావును అధ్యాపకులను ప్రిన్సిపల్ ఎస్ఎస్ శ్రీనివాస్, ఎంపిడిఒ రాంబాబు, తహశీల్దారు ఠాగూర్, జనసేన మండల ఇన్‌ఛార్జి అన్నం శ్రీరామచంద్రమూర్తి అభినందించారు.

జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన సాయి జ్యోతి

ఉపాధి హామీ పనులు కల్పించాలి

ప్రజాశక్తి-పిఠాపురం

ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని, వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పి.రాయవరంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం సంఘం నాయకులు ఊబా బుల్లబ్బాయి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఏప్రిల్ నెల నుండి కూలీల అందరికీ పనులు కల్పించాలని జిల్లా అధికారులు చెప్తున్న క్షేత్రస్థాయిలో కూలీలందరికీ నేటికీ పనులు కల్పించడంలేదన్నారు. గత 11 వారాలుగా చేసిన పనులకు డబ్బులు చెల్లించకపోవడం చాలా దుర్మార్గమని వేతనాలు ఇవ్వకపోతే ఉపాధి కూలీలు ఎలా బ్రతకాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.సింహాచలం, నాయకులు రుద్రవరపు భూలోకం, కాల్దారి రాఘవ, సింహచలం, బత్తుల నాగరాజు, సత్యవతి, ధర్మరాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్.శ్రీనివాస్

సామాజిక న్యాయ సాధనకు ఐద్వా జాతా

ప్రజాశక్తి-కాకినాడ

సామాజిక న్యాయం సమానత్వ సాధన కోసం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం పిలుపులో భాగంగా ఐద్వా జిల్లా జాతా ఈ నెల 11వ తేదీ నుండి 14వ తేదీ వరకు నిర్వహిస్తామని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సిహెచ్.రమణి, జిల్లా కార్యదర్శి కె.వరలక్ష్మి తెలిపారు. 11న సామర్లకోట, స్వామి నగర్, చిన్న స్వామి నగర్, ఇంద్రపాలెం, కచేరిపేట, డ్రైవర్ కాలనీలో జాతా కొనసాగిందన్నారు. నా ఎంపిక నా హక్కు అనే అంశాన్ని తీసుకొని దేశవ్యాప్తంగా జాతాలు ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు దాటినా ఇప్పటికీ అమ్మాయిలకు జీవిత భాగస్వామిని ఎన్నుకునే స్వాతంత్ర్యం లేదన్నారు. వారు వివాహం చేసుకుంటే పరువు హత్యలు, గౌరవ హత్యల పేరుతో చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం చాలా బాధాకరం అన్నారు. సామాజిక సమానత్వం సాధించాలంటే సంఘ సంస్కర్తలు జ్యోతిబాఫూలే, సావిత్రీబాయి పూలే, అంబేద్కర్, వీరేశలింగం, గురజాడ స్ఫూర్తితో మహిళలందరూ చైతన్యవంతులై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.భూలక్ష్మి, ఐ.దుర్గ, కె.దుర్గాదేవి, పద్మ, దేవుడమ్మ, గౌరి, లోవ పాల్గొన్నారు.

జాతా నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

సిఎస్‌ఆర్ నిధులతో పార్క్ నిర్మాణం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రమణయ్యపేట ఎఫ్‌సిఐ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న పార్క్‌కు రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.45 లక్షల జెమిని ఆయిల్స్ వారి సిఎస్‌అర్ నిధులతో పార్క్ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో రోడ్ల నిర్మాణంతో పాటు పార్క్‌లు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో జెమిని కంపెనీ అధికారులు, కూటమి నాయకులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పందేలు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలులో సీతారామస్వామి మహోత్సవాల ముగింపు సందర్భంగా రాష్ట్రస్థాయి యడ్ల పరుగు పందేలు నిర్వహించారు. రాష్ట్రం నుండి సీనియర్స్ జూనియర్స్ విభాగాలుగా 30 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఎంతో ఉల్లాసంగా సాగిన ఈ ఎడ్ల పరుగు ప్రదర్శనలో సీనియర్స్ విభాగంలో మొదటి స్థానం మట్ట నవనీత్ శ్రీమణికంఠ కొవ్వాడ, రెండో స్థానం కొర తేజ చౌదరి గుమ్ములేరు, మూడవ స్థానం వేగుల తేజ చౌదరి మండపేట, జూనియర్స్ విభాగంలో శ్రీ సిద్ధి వినాయక ధరణి శ్రీనివాస్ వడిసిలేరు, రెండో స్థానం కె.సతీష్ హైదరాబాద్ తెలంగాణ, మూడో స్థానం నిమ్మకాయ నూకరాజు గొల్లప్రోలు, నాలుగో స్థానం భవిరిశెట్టి మణి వన్నెపూడి విజేతలుగా నిలిచారు.

భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి- పెద్దాపురం

మహిళల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శనివారం మర్లావ గ్రామంలో రూ.13.6 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని కుడా చైర్మన్ తుమ్మల బాబుతో కలిసి ఎంఎల్ఎ ప్రారంభించారు. అనంతరం ఎంఎల్ఎ చినరాజప్ప మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణ, ఆర్థికాభివద్ధికి అనేక పథకాల ద్వారా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ జి.ఉష, సర్పంచ్ తోట రామకృష్ణ, ఉప సర్పంచ్ యాళ్ల రాంబాబు, అంగన్‌వాడీ సూపర్వైజర్ ఉమాదేవి, మహిళా పోలీసు దేవి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రసన్న, పెద్ది గణపతి, అంగన్వాడీలు ఎస్‌కె.పాపాయమ్మ, బి.అన్నపూర్ణ, ఎన్.గౌరీదేవి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

విద్యాశాఖలో ఉద్యోగులంతా తల్లిదండ్రులను చైతన్య పరచి బడిఈడు పిల్లలు అందరిని బడిలోనే ఉండేలా చర్య తీసుకోవాలని జిల్లా కమ్యూనిటీ మొబలైజ్ ఆఫీసర్ చామంతి నాగేశ్వరరావు అన్నారు. శనివారం సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌ను ఆయన సందర్శించి విద్యార్థుల చేరికలను ధ్రువపరిచారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల మరికొన్ని పాఠశాలలను కూడా విజిట్ చేశారు. ఆన్‌లైన్‌లో నమోదైన విద్యార్థులు ఖచ్చితంగా పాఠశాలలో ఉండాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తున్న దృష్ట్యా బడిలో చేరికలు ఎక్కువగా ఉండేలా హెచ్‌ఎం లు, టీచర్లు కృషి చేయాలన్నారు. ఎంఇఒలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య, హెచ్‌ఎంలు తోటకూర సాయిరామ కృష్ణ, యు.మీనా మాధురి, తనూజ, హనుమంతరావు, బేబీ రాణి, బి.శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.

అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీ హరీష్, ఎంఎల్ఎ దాట్ల

సమానత్వ సాధనే అంబేద్కర్ ధ్యేయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

సమానత్వ సాధనే అంబేద్కర్ ధ్యేయమని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. పోలేకుర్రు పంచాయితీ సుంకటరేవులో అంబేద్కర్ విగ్రహావిష్కరణలో వారు పాల్గొన్నారు. తొలుత ఉండ్రాజవరం బౌద్ధ దమ్మ పీఠం అధ్యక్షులు భంతే అనాలయో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనాలయో మాట్లాడుతూ ప్రబుద్ధ భారత్ నిర్మించాలనేది అంబేద్కర్ ఆశయం అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, ఎంపిటిసి బళ్ల సంధ్యారాణి, జక్కల ప్రసాద్ బాబు, యూత్ అధ్యక్షుడు దడాల సుధీర్ కుమార్, జన చైతన్య మండలి వ్యవస్థాపకుడు పావన ప్రసాద్, లైఫ్ లైన్ హాస్పిటల్ అధినేత కోరుకొండ బాబ్జి, మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, చెల్లి అశోక్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



గ్రామాల్లో తాగునీటి పథకాలు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని చదలాడ, తిరుపతి, తూర్పుపాకలు, మర్లావ గ్రామాల్లో నిర్మించిన తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపులైన్లు, ఇంటింటి కొళాయిలకు శనివారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభలలో ఎంఎల్ఎ చినరాజప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు, ఎలిసెట్టి నాని, తిరుపతి సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, మర్లావ సర్పంచ్ తోట రామకృష్ణ, రేలంగి వెంకటరావు, కొమ్మిరెడ్డి బుజ్జి, జల్దాని సుబ్రహ్మణ్యం, రేలంగి బుజ్జి పాల్గొన్నారు.

తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో 8 మందికి గాయాలు

ప్రజాశక్తి -దేవరపల్లి

యర్నగూడెం జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది గాయపడ్డారు. ఒక కుటుంబం అన్నవరం దర్శనానికి కారులో వెళ్లి శనివారం తిరుగు పయనమయ్యారు. కారు యర్నగూడెం వద్ద పాత హెచ్‌సిసి ప్రాంతానికి వచ్చే సరికి సర్వీస్ రోడ్ వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టుకుంటూ పక్కన పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో గోపాలపురం ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరి అరెస్ట్
రూ.50 వేల స్వాధీనం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం ఎస్‌ఐకి క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారన్న సమాచారంతో 11న రాత్రి పదిన్నర గంటలకు రామదుర్గ వీధిలో గల ఒక డాబాలో దాడి చేసి ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. 2 సంవత్సరముల క్రితం ఇంటిని కోనాల శ్రీనివాసరెడ్డి అద్దెకు తీసుకొని క్రికెట్ బెట్టింగుకు కావలసిన టివి, ల్యాప్‌టాప్ ఫోన్ లను ఏర్పాటు చేసుకొని అసిస్టెంట్‌గా మాచవరానికి చెందిన రాళ్ల నాగబాబు ను జీతానికి పెట్టుకొని క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తున్నట్లు నిందితులు తెలిపారు. రామచంద్రపురం ఎస్‌ఐ నాగేశ్వరరావు తన సిబ్బందితో రైడ్ చేసి నిందితుల నుండి రూ.50 వేలను, 9 సెల్‌ఫోన్ లను, 1 ల్యాప్ టాప్ ను, ఒక టివి, సెట్ టాప్ బాక్స్, ఫైబర్ బాక్స్, మోటార్ సైకిల్ సీజ్ చేసి కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ వివరించారు. క్రికెట్ బెట్టింగ్ గురించి ఏ విధమైన సమాచారం తెలిసిన డిఎస్‌పి రఘువీర్, రామచంద్రపురం సెల్ 9440796507, లేదా సిఐ వెంకట్ నారాయణ సెల్ 94407963536, ఎస్‌ఐ నాగేశ్వరరావు సెల్ 9440796589 నెంబర్‌లకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఏలేశ్వరం

స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఎదురెదురుగా వస్తున్న మోటార్ సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందినట్టు ఎస్‌ఐ ఎన్.రామలింగేశ్వర తెలిపారు. ఏలేశ్వరం గొల్లలమెట్టకు చెందిన లారీ డ్రైవర్ బుద్దాని సూరిబాబు (36) శుక్రవారం సాయంత్రం తన బైకుపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న బైకు ఢీకొంది. సూరిబాబు తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఆయన తెలిపారు. సూరిబాబు భార్య లక్ష్మీ ప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేరస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ధర్నా చేస్తున్న ఎఐడిఎంకె నాయకులు

చెత్తను తొలగించాలని ధర్నా

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం వద్ద ఎఐడిఎంకె సెక్రెటరీ మంచాల సత్య సాయికుమార్ ఆధ్వర్యంలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ చెత్తను వెంటనే తొలగించి ప్రజల ఆరోగ్యం కాపాడాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి డంపింగ్ యార్డ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలన్నారు. తక్షణమే డ్రైనేజీలో దోమల నివారణ మందు జల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం ప్రెసిడెంట్ నల్లా వెంకన్న, మాగాపు సుబ్బారావు, యానాం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ ఈలప్రోలు విష్ణువర్ధన్ రావు, పెసల వెంకటేష్, చెక్కల అరుణ్ కుమార్, వేగేశ్న చిన్న రాజు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి నిల్వల పరిశీలన

ప్రజాశక్తి - యానాం

తాగునీటి నిల్వలను పరిపాలనాదికారి మునిస్వామి అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ప్రజా పనుల శాఖ ఆధ్వర్యంలోని మంచినీటి చెరువుల నుండి ప్రజలకు మంచినీటి సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నల్లచెరువు 50 ఎకరాల మంచినీటి ట్యాంకులలో నీటి నిల్వలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ప్రత్తిపాడులో గిరిబాబు పర్యటన

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

మండలంలోని పోతులూరులో వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శనివారం పర్యటించారు. గిరిబాబుకు వైసిపి నాయుకులు, కార్యకర్తలు అభిమానులు ఘన స్వాగతం పలికారు. కార్యకర్తలను అభిమానులను కలిసిన అనంతరం గిరిబాబు మాట్లాడుతూ అందరూ రాజకీయంగా తనను ముందుకు తీసుకువెళ్లి ఆశీర్వదించాలని కోరారు. నియోజకవర్గంలో కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానన్నారు. గ్రామాల్లో పార్టీని క్షేత్రస్థాయి నుండి బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్ల క్రాంతి సుధాకర్, సర్పంచ్ బోండి రాంబాబు, శెట్టి సత్తిబాబు, చక్కపల్లి నాగేశ్వరరావు, రామిశెట్టి నాని, జల్లిగంపల ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

సమాజంలో పేదలను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని ధర్మవరం పంచాయతీ కార్యదర్శి బి.కామరాజు పేర్కొన్నారు. శనివారం సదా మీ సేవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెల నిరుపేద విద్యార్థులకు అందించే పౌష్టికాహార కిట్లను కార్యదర్శి కామరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో పడాల శ్రీనివాస్ రెడ్డి, అంతర్జాతీయ ఛాయాచిత్ర అవార్డు గ్రహీత సలాది కృష్ణ, జి.సత్యానందం, ఎస్‌వి.సోమేశ్వరరావు, ఎస్.లోవ కుమారి పాల్గొన్నారు.

ఉపాధి వెతలు.. గ్యాస్ భారాలు..

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉపాధి కూలీలు వేతన వెతలతో ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉపాధి పనులకు సంబంధించిన బకాయిలు నిలిచిపోవటమే ఈ దుస్థితి కారణం. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి చట్టానికి తూట్లు పొడుస్తున్న విషయం విదితమే. సంస్కరణల పేరుతో అనేక మార్పులు తీసుకొచ్చింది. రెండేళ్ల క్రితం నూతన సాఫ్ట్‌వేర్ అమలు చేసి కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ అంటూ సాకు చెప్పింది. దీనికి తోడుగా రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ఫీల్డ్ అసిస్టెంట్లను వేధింపులకు గురి చేస్తూ అక్రమ తొలగింపులకు పాల్పడుతున్నాయి. మరోవైపు ఉపాధి చట్టానికి తూట్లు పొడిచి నెలల తరబడి కూలీలకు బకాయిలు పెట్టడం పరిపాటిగా మారింది. సమ్మర్ ఎలవెన్స్‌లకు మంగళం పలకడం, కూలీలకు కావల్సిన పనిముట్లు వారే తెచ్చుకోవాలని చెప్పడం వంటివి కూలీలకు వేదన మిగులుస్తున్నాయి. మరోవైపు ప్రాథమిక వైద్యం అందించే కిట్లు లేకపోవటతో పాముకాట్లకు, వడదెబ్బ కారణంగా మృతువాత పడటం పరిపాటిగా మారింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తక్షణమే ఉపాధి బకాయిలు చెల్లించటంతో పాటు పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఉపాధి కూలీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల అడ్మిషన్ల జోరు ఈ వారం మరింత పెరిగింది. వారాంతంలో ఇంటర్ ఫలితాలు వెల్లడైన విషయం విదితమే. విద్యా సంవత్సరం త్వరగా ప్రారంభం కావటంతో ప్రైవేట్ కాలేజీలలో మరింత జోష్ పెరిగింది. విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న కొన్ని కార్పొరేట్ కళాశాలల నుంచి పిఆర్‌ఒల పేరుతో ప్రతినిధులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రవేశాలకు ఆహ్వానం పలుకుతున్నాయి. విద్యార్థుల వివరాలు, ఫోన్ నంబర్లు, చిరునామాలు సేకరించి కళాశాలలకు రావాలని కోరారు. కొన్ని కళాశాలల యాజమాన్యాలు ఇంటింటికీ వెళ్లి బ్రోచర్లు అందించి, ఫీజు రాయితీలు కూడా ఇస్తామని హామీలు గుప్పించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్వాన్సుల రూపంలో కొంత మొత్తం నగదు కట్టించుకొని సీటు రిజర్వు చేయిస్తున్నట్టు సమాచారం. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు వెలువడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలకు పంపిస్తారనే ఆశాభావం అధ్యాపకులలో వ్యక్తవముతోంది. .

వినియోగదారులపై బండ భారం

కేంద్ర ప్రభుత్వం వంటగదిలో చిచ్చుపెట్టడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకే సారి రూ.50 పెంచటతో ప్రస్తుతం 14 కేజీల సిలిండర్ ధర రవాణా ఛార్జీలతో కలిపి సుమారు రూ.950కి చేరింది. గత ఏడాది ఎడా పెడా సిలిండర్ ధరలు పెంచినప్రభుత్వం ఎన్నికల ముందు ధరలు తగ్గించి ప్రజలను మభ్యపెట్టిందనే అభిప్రాయం వినియోగదారులలో వ్యక్తమవుతోంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత సిలిండర్ ధరలు నిబంధనల చట్రం వెంటాడింది. ఫలితంగా అర్హులకు సైతం ఉచితం అందని ద్రాక్షలా మారింది. తాజా ధరల పెంపు తమకు సంబంధం లేదనటంపై విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికే నిత్యావస సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గడిచిన 10 నెలలో ధరల నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మరోవైపు వంటగ్యాస్ ధర పెంపు గోరుచుట్టుపై రోకలిపోటులా మారుతోంది. పాలకులుఇప్పటికైనా స్పందించి ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

మొక్కుబడిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏర్పాటైన ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ మొక్కుబడిగా సాగుతోంది. కొన్ని మండలాలల్లో వరికోతలు ఇప్పటికే 50 శాతం పూర్తయిన విషయం విదితమే. మరి కొన్ని మండలాల్లో ఇప్పటికీ 10 శాతం కూడా పూర్తికాలేదు. రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించిన విషయం విదితమే. అయితే సాంకేతిక సమస్యలు, గోనె సంచుల సరఫరా వంటి సమస్యలు ఆదిలోనే హంసపాదులా మారాయి. మరోవైపు అక్కడక్కడా కురుస్తున్న వర్షాలు గోరుచుట్టుపై రోకలి పోటులా మారింది. రైతన్నల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో దళారులను ఆశ్రయించక తప్పడం లేదు. ప్రభుత్వ మద్దతు ధరకు క్వింటాకు రూ.300 తక్కువగా విక్రయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపాలనే రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీఅగస్త్య జయభేరి

ప్రజాశక్తి-కాకినాడ

అనతికాలంలోనే జిల్లాలో ప్రత్యేకత సాధించిన శ్రీఅగస్త్య విద్యాసంస్థలు ఇంటర్ ఫలితాలలో ప్రత్యేకతను చాటుకున్నాయి. గాంధీనగర్‌లోని జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, అధ్యాపక బందాన్ని విద్యాసంస్థల ఛైర్మన్ దొడ్డిపట్ల నాగేశ్వరరావు (డిఎన్ఆర్) అభినందించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో గురుపల్లి అలేఖ్య 465/470 మార్కులతో కళాశాల టాపర్ నిలవగా, 464 మార్కులతో పోలిశెట్టి సూర్యతేజ, ఎలిపే ప్రైజీ ప్రిస్కిల్లా, చీమలకొండ సాయి షణ్ముఖ్ సాత్విక్ లు రెండవ స్థానంలో నిలిచారని, జి.సోమశేఖర్, మారిన చాందినీ అలేఖ్య, సిగిరెడ్డి లాస్య, పట్టాభి రుత్విక్ సుజయ్లు 463 మార్కులు, గరుగు జోష్మిత సాహితి 462 మార్కులు, కెవిఎస్.గౌరీ శ్రవణ్, పి.లక్ష్మీ ప్రణతి, కెఎస్ఎన్.మణివర్మ, రేపాటి చరణ్ 461 మార్కులు, వెంటూరి తేజష్ వెంకట సాయి, అనిమిని శ్రీదర్షిత్ 460 మార్కులు సాధించారన్నారు. తమ విద్యార్థులలో 15 మందికి 460 మార్కులకు పైబడి, 36 మందికి 450 మార్కులకు పైబడి సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. జూనియర్ ఇంటర్ బైపిసిలో సిహెచ్.సత్యవతి, కె.ఆహ్లాద 434/440 మార్కులతో టాపర్లుగా నిలవగా, ఎస్.శ్రేయ, జి.నిఖితలు 433 మార్కులు, కె.లతిక, కె.సాయి అభిరాము 431 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపిసిలో కాళ్ల ఛాయ చరిష్మా 988/1000 మార్కులతో టాపర్ గా నిలవగా, పి.హాసిని 982 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ బైపిసిలో వి.సువర్ణ లక్ష్మి 982/1000 మార్కులతో టాపర్‌గా నిలవగా, జిఎస్.సూర్య సంహిత్ 972 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపిసి, బైపిసిలలో 29 విద్యార్థులు 950 మార్కులకు పైబడి సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అతి తక్కువ మంది విద్యార్థులతో తమ కళాశాల ఉత్తమ ఫలితాలు సాధింస్తుందన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించడానికి కారకులైన అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బందికి ఛైర్మన్ దొడ్డిపట్ల నాగేశ్వరరావు (డిఎన్ఆర్) అభినందనలు తెలియజేశారు.

విద్యార్థులతో విద్యాసంస్థల ఛైర్మన్ దొడ్డిపట్ల నాగేశ్వరరావు

ప్రగతి విద్యార్థుల హవా

ప్రజాశక్తి-సామర్లకోట

స్థానిక ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగరవేశారని ప్రగతి విద్యాసంస్థల ఛైర్మన్ నూతలపాటి పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని పిల్లా హర్షిని జూనియర్ ఎంపిసి విభాగంలో 470/465 మార్కులు, జూనియర్ బైసిపిలో జి.తేజస్వి 440/433 మార్కులు సాధించారని, సీనియర్ ఎంపిసి విభాగంలో ఎన్.రమేష్ 1000 మార్కులకు 985 సాధించారని తెలిపారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో 465, 463, 463, 462, 462, 462, 462, 462, 461, 4 6 0 మార్కులు ఆ పైన 16 మంది సాధించి రికార్డు సృష్టించారని అన్నారు. విద్యార్థులను ప్రగతి విద్యాసంస్థల ఎజిఎం సాదినేని అనిల్ బాబు , జూనియర్ కాలేజ్ ఎఒ సిహెచ్ఆర్.సత్యనారాయణ, ప్రిన్సిపల్ జి.నాగబాబు అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న సిబ్బంది

కెఎస్ఎన్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - సామర్లకోట

ఇంటర్ ఫలితాలలో కెఎస్ఎన్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరచి అత్యధిక మార్కులు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ ఆర్.రాధాకృష్ణ తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో కె.మోహన్ ఆదిత్య-463, ఆర్ఎస్.మణికంఠ-462, ఎ.సుమ వెంకట కళ్యాణి-462, జిఎస్‌బి.గణేశ్వరరావు-461, బిఎస్ఎస్.కృతిక్-460, డిఎంఎస్ చైతన్య-460, ఎం.రేవతి-460, పి.వరలక్ష్మి-460, బిఎం.భావన-460 మార్కులు సాధించారని, సీనియర్ ఇంటర్‌లో డిఎస్ఎల్ సౌమ్య 985, జి.రాజా త్రిలోకేశ్ 981 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభను కనపరిచారని కళాశాల ప్రిన్సిపల్ ఆర్.రాధాకృష్ణ తెలిపారు. విద్యార్థులను సిబ్బందిని కళాశాల ఎఒ వెంకటేశ్వరరావు, డైరెక్టర్ శ్రీను, కరస్పాండెంట్ కుమారి అభినదించారు.

విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

శ్రీహనుమంతరాయ ప్రభంజనం

ప్రజాశక్తి-పిఠాపురం

శ్రీ హనుమంతరాయ జూనియర్ కళాశాల విద్యార్థులు టౌన్ ఫస్ట్ ర్యాంకులతో పాటుగా అత్యధిక ఉత్తీర్ణత శాతం పొందినట్టు కళాశాల ప్రిన్సిపాల్ దాసం గంగా మహేష్, వైస్ ప్రిన్సిపాల్ అల్లాడ ఆనంద్ తెలిపారు. సెకండియర్ ఎంపిసిలో కొప్పిశెట్టి స్పందన 977/1000 మార్కులతో టౌన్ ఫస్ట్ ర్యాంక్, పోతుల సత్య 967/1000 మార్కులతో సెకండ్ ర్యాంకులో నిలిచారని, సెకండ్ బైపిసిలో 970/1000 మార్కులతో బేత నాగ ప్రవల్లిక ఫస్ట్ ర్యాంక్, 920/1000 మార్కులతో బచ్చు సంధ్య సెకండ్ ర్యాంక్, సెకండ్ సిఇసిలో 917/1000 జట్ల శ్రీఅంజలి ప్రథమ స్థానం, 906/1000 వివిఎస్ఎల్.వైశాలి ద్వితీయ స్థానం, ఫస్ట్ సిఇసిలో జవ్వాది వెంకటలక్ష్మి 472/500 మార్కులతో టౌన్ ఫస్ట్ ర్యాంక్, వెంపట శృతి 452/500 మార్కులతో సెకండ్ ర్యాంక్, ఫస్ట్ ఎంపిసిలో చెల్లూరి దేవీశ్రీ 447/470 ప్రథమ స్థానం, గుబ్బల యామిని 440/470 ద్వితీయ స్థానం, హెచ్ఇసిలో జమ్మలమడక ఐశ్వర్య సూర్య దీపిక 442/500 మార్కులతో టౌన్ ఫస్ట్ ర్యాంక్ సాధించారన్నారు.

కె.స్పందన, పి.సత్య, బి.ప్రవల్లిక, జట్ల శ్రీఅంజలి, వివిఎస్.వైశాలి, వెంకటలక్ష్మి, వి.శృతి, సిహెచ్.దేవిశ్రీ, జి.యామిని, సూర్య దీపిక

ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో రెసిడెన్సీ ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో 23వ వార్డు కౌన్సిలర్ సేపేని సురేష్ కుమార్ దంపతులు నిర్మించిన శ్రీ సాయిరూప స్టార్ రెసిడెన్సీని శనివారం పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, వైసిపి పెద్దాపురం నియోజకవర్గ ఇన్చార్జి దవులూరి దొరబాబు, వైసిపి సీనియర్ నాయకులు దవులూరి సుబ్బారావులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రైల్వే స్టేషన్ బస్టాండ్ సెంటర్ కావడంతో ఇక్కడ వసతి కోసం ప్రైవేట్ యాజమానులు అధిక రేట్లు పెట్టి ఇబ్బందికి గురి చేస్తున్నందున, సామాన్య ప్రజలకు సైతం ధరలు అందుబాటులో ఉండేలా సేవలను అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్ (చిన్ని), కౌన్సిలర్ బలుసు వాసు, నాయకులు కంటే జగదీష్ మోహన్, వల్లూరి దొరబాబు, గోలి వెంకట అప్పారావు చౌదరి, మాజేటి కృష్ణ, లయన్స్ క్లబ్ నాయకులు చిత్తలూరి వీర్రాజు (రాజా), మేకా శ్రీనివాసరావు, కర్రి ఆదినారాయణ రెడ్డి, అమలకంటి శ్రీనివాసరావు, కాపుగంటి పైడి రత్నం, కూటమి నాయకులు అందుగుల జార్జి చక్రవర్తి, కాళ్ళ రవీంద్ర పాల్గొన్నారు.

పాత తహశీల్దారు కార్యాలయ స్థలం పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పాత పోలీస్ స్టేషన్ వద్ద గల పాత తహశీల్దారు కార్యాలయ స్థలాన్ని, భవనాన్ని పెద్దాపురం ఎంఎలఎ నిమ్మకాయ చినరాజప్ప శనివారం పరిశీలించారు. సామర్లకోట సబ్ రిజిస్టర్ కార్యాలయం సామర్లకోట-పెద్దాపురం ఎడిబి రోడ్డులోని పట్టణానికి దూరంగా మాజేటి నగర్లో అద్దె భవనంలో కొనసాగుతుండగా, సామర్లకోట పట్టణ ప్రజలకు అందుబాటులోనికి తెచ్చేందుకు ఖాళీ స్థలాన్ని ఎంఎల్‌ఎ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్పు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. తహశీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డి, బడుగు శ్రీకాంత్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కౌన్సిలర్ బలుసు వాసు, జగదీష్ మోహన్, వల్లూరి దొరబాబు, అందుగుల జార్జి చక్రవర్తి, కాళ్ళ రవీంద్ర పాల్గొన్నారు.

కార్యాలయ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

శ్రీనిధి జూనియర్ కాలేజీ ప్రభంజనం

ప్రజాశక్తి - శంఖవరం

ఇంటర్ ఫలితాల్లో శ్రీనిధి విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఎంపిసి విభాగంలో కొయ్య నాగదేవి 979 మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. వై.యామిని 967 మార్కులతో రెండో స్థానం పొందింది. బైపిసిలో ఎం.లక్ష్మి 976, ఎం.మాధవి 969 మార్కులు సాధించి మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. సిఇసిలో వై.వెంకటలక్ష్మి 905 మార్కులు సాధించింది. జూనియర్ ఇంటర్ సిఇసిలో టి.నవ్యశ్రీ 460, ఎం.వరలక్ష్మి 423 మార్కులతో మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. ఎంపిసిలో జి.వర్షిణి 450తో మొదటి, కె.దుర్గాప్రభప్రసన్న 448 మార్కులతో 2వ స్థానంలో నిలిచారు. బైపిసిలో టి.రామలక్ష్మి 419, కె.కరుణశ్రీ 403 మార్కులతో రాణించారు. వీరిని ప్రిన్సిపల్ నాయుడు రవి, కరెస్పాండంట్ దాసం గంగామహేష్, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

కొయ్యా నాగదేవి

సత్తా చాటిన 'త్రిపుర'

ప్రజాశక్తి - తొండంగి

ఇంటర్ ఫలితాల్లో త్రిపుర జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. సీనియర్ ఎంపిసిలో కారుమూరి అభియేషు 965, టి.లక్ష్మి 921 మార్కులు సాధించారు. బైపిసిలో సప్పా అనంత లక్ష్మి 943, యనమల పావని 927, సిఇసిలో గింజాల శిరీష 912 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో పగడాల భార్గవి 439, దూలం విజయ 404, బైపిసిలో కొయ్య ప్రియాంక నాగసత్యఅనంతదేవి 419, ఎంఇసిలో గొర్ల అనూష 440 మార్కులు సాధించారని ప్రిన్సిపల్ జి.మల్లేశ్వరరావు తెలిపారు. వీరిని యాజమన్యాం సిహెచ్.శ్రీనివాస్, బివి.నాగన్న, కె.వరహాలబాబు అభినందించారు.

కె.అభియేషు

అఖిల్ విద్యార్థుల విజయ ఢంకా

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ సిటీ శాంతినగర్ అఖిల్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ డంకా మోగించారని కాలేజీ డైరెక్టర్ ఆంధ్ర సూర్యనారాయణ తెలిపారు. జూనియర్ బైపిసి విభాగంలో ఫాతిమా ఐశ్వర్య 440/434 మార్కులు, ఎంపిసిలో రియా 455, సుజిలేష్ 454, సీనియర్ బైపిసిలో వి.వర్షిత 975, విక్రం ఆశిష్ 952, శివ కార్తీక్ 975 మార్కులు సాధించినట్టు తెలిపారు. జూనియర్ విభాగంలో 400పైన మార్కులు సాధించిన విద్యార్థులు 18 మంది ఉన్నారని, సీనియర్ విభాగంలో 450 మార్కులు పైన సాధించిన విద్యార్థులు ఆరుగురు 900 పైన సాధించిన విద్యార్థులు 12 మంది ఉన్నారని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు డైరెక్టర్ సూర్యనారాయణ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రథమ స్థానంలో ఎర్రవరం శ్రీ సూర్య

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఇంటర్ ఫలితాల్లో ఎర్రవరం శ్రీ సూర్య విద్యాసంస్థల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో నిలిచారని కరస్పాండెంట్ కెవివి సత్యనారాయణ తెలిపారు. ఎంపిసిలో వెల్లంపల్లి శివ దేవి (1000/984) సారా అనుష్క (1000/982) తుంపాల మౌనిక దేవి (1000/980), బైపిసిలో గొలగాని అను (1000/974) ఇల్లపు సౌజన్య (1000/968) టేకి సత్యకృష్ణ (1000/966) మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. మొదటి సంవత్సరం బైపిసి ఎంపీసీలో సైతం విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు 470 మార్కులకు గాను 400 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు 90 శాతం ఉన్నారన్నారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ ఎలమంచిలి శేఖర్, అధ్యాపకులు, సిబ్బంది తల్లిదండ్రులు అభినందించారు.

ఎస్‌కెకెఎంలో విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎస్‌కెకెఎం విద్యార్థులు ఇంటర్లో ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ వివిఎస్ చక్రవర్తి తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో మేడిది వేణు (ఎంపిసి-944) దాడి మేఘన (ఎంపిసి 943) కొమ్మిరెడ్డి నందిని (సిఇసి-937) మరుకుర్తి నాగలక్ష్మి (917) పలకల లహరి (901) మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్‌లో కేశవరపు నందిని (సిఇసి-454) కురుకూరు ఐశ్వర్య (ఎంపిసి-438) బర్రెల దుర్గాదేవి (ఎంపిసి-409) మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు అనేకమంది విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారన్నారు. విద్యార్థులు, అధ్యాపకులను కళాశాల ఛైర్మన్ కెవిఆర్.మూర్తి, డైరెక్టర్లు ఎం.చక్రం, పి.ఏసుబాబు, పి.మధుసూదన్ రావు అభినందించారు.

రవి కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తాళ్లరేవు

సుంకరపాలెంలోని రవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటినట్టు కళాశాల ఛైర్మన్ పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో కె.జయ అజయని 464, జి.రేష్మ 463, బైపిసిలో సిహెచ్.కిన్నెర 432, కె.కావ్య 431, సిఇసిలో యు.సిరివెన్నెల 483 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచారని తెలిపారు. సీనియర్ ఇంటర్ బైపిసిలో కెడిఎస్.మణితేజ 985, పివిఎస్‌యు దుర్గేశ్వరి 981, బైపిసిలో ఎం.అనూషా 985, బి.దివ్య 980, మార్కులతో మొదటి, రెండవ స్థానంలో నిలిచారని తెలిపారు. సిఇసిలో ఎం.విజయ్ 936 ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. విద్యార్థులను కళాశాల ఛైర్మన్ పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ పెద్దిరెడ్డి రవికుమార్ అభినందించినట్లు తెలిపారు.

వల్లభస్వామికి రూ.2.80 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు మొత్తం రూ.2,80,809 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాస రావు తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహ అన్నదానం నిర్వహించామన్నారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు యాత్రికులకు సహాయ సహకారాలు అందించారన్నారు.

సాక్షి సిబ్బందిపై కేసులు ఉపసంహరించాలి

ప్రజాశక్తి-కాకినాడ

సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి మరో ఆరుగురిపై నమోదు చేసిన అక్రమ కేసులను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ కాకినాడ లో జర్నలిస్టులు ధర్న చేశారు. సిటీ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ధర్నాలో ఎపిడబ్ల్యుఎఫ్, ఎపియుడబ్ల్యుజె, జాప్ సంఘాలకు చెందిన జర్నలిస్టు ప్రతినిధులు, పాల్గొన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావ్‌కు వినతి పత్రం అందజేశారు. నిజాలను నిర్భయంగా వార్త రూపంలో ప్రజలకు తెలియజేసే జర్నలిస్టుల మీద కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం సరికాదని నాయకులు ఖండించారు.

ఉల్లాసంగా ఆటల పోటీలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

అంబేద్కర్ జయంతోత్సవాలలో భాగంగా పోలేకుర్రు పంచాయతీ జైభీమ్ పేటలో శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు ఈ నెల 14న అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని గ్రామ పెద్ద దడాల తాతారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, ఎండియుడబ్ల్యుఎ అధ్యక్ష కార్యదర్శులు కన్నీడి వెంకటరమణ, కుసుమ శ్రీనివాస్, విప్పర్తి శ్రీనివాస్, రొక్కం లోవరాజు పాల్గొన్నారు.

బాక్సర్స్‌కు పతకాలు

ప్రజాశక్తి-పిఠాపురం

7వ రాష్ట్రస్థాయి యూత్ ఉమెన్ బాక్సింగ్ పోటీలలో పిఠాపురం బాక్సర్స్ పతకాలు సాధించారని కోచ్ పి.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు పర్యవేక్షంలో శనివారం విశాఖపట్నం పోర్టు స్టేడియంలో జరిగిన 7వ రాష్ట్రస్థాయి యూత్ ఉమెన్ బాక్సింగ్ పోటీలలో జె.ఐశ్వర్య సూర్య దీపిక రజత పతకం, 70 కేజీల విభాగంలో ఎఎస్ఎస్ వైష్ణవి కాంస్య పతకం సాధించారన్నారు. వీరిని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్ కుమార్, కె.పద్మనాభం అభినందించారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను అరికట్టాలి

ప్రజాశక్తి -కరప

ప్లాస్టిక్ వ్యర్థాలను అరికట్టడం ప్రజలను చైతన్యపరిచినప్పుడే సాధ్యమవుతుందని మండల పంచాయతీ విస్తరణ అధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. శనివారం నడకుదురు, పెద్దాపురపాడు, కొరుపల్లి గ్రామాలలో చెత్త సేకరణ, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, వాడిన ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీ, పంట కాలువల్లోని వెయ్యరాదని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వరిజ, వీరభద్రరావు, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

PASSPORT MISSING

I, Shaik Sharif, S/o Kalemastan Vali, Resident of D.No.3-88-1, Tadimalla, Nidadavole, W.G.Dist., Now E.G. District, AP., I have Lost my Passport No: U3383446 on Date 08.04.2025. Misplaced while Renovation of My Own Home, Shifting to another Rented Home in Tadimalla Village. So please issue a New Passport.
If any one found please inform to my Mobile Number : 72859 20080.

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
O.S. No. 80/2023
Between:
Ramba Sanyasirao & another ...*Petitioners*
AND
Tatavarthi Surya Kumar & Others ...*Defendants*
D-4: Gadamsetty Mohana Siddeswara Swamy, S/o. Srinivasulu, Hindu, aged about 58 years, Business, R/o. D.No. 45-47-25, Ambedkar Nagar, Thadithota, Rajamahendravaram, E.G.Dist., ...*4th Defendant*

పై నెంబరు దావాలో 4వ ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 24-4-2025వ సం॥రం తేదీన ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
డి.అప్పారావు, అడ్వకేట్
రాజమండ్రి రాజమహేంద్రవరం
తేది:12-4-25 సెల్: 9849713577